నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 22 మార్చి 2024 | KHAMMAM

‘వనజీవి’ దంపతులకు సన్మానం

వనజీవి దంపతులను సన్మానిస్తున్న సామాజికవేత్తలు

ఖమ్మం రూరల్, మార్చి 21: ఖమ్మం నగరానికి చెందిన డాక్టర్ కడవెండి వేణుగోపాల్, అన్నం సేవా ఫౌండేషన్ మేనేజర్ కేశపట్నం శ్రీనివాసులు గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా రెడ్డిపల్లిలోని పద్మశ్రీ వనజీవి రామయ్య స్వగృహానికి చేరుకున్నారు. ‘వనజీవి’ దంపతులను సన్మానించారు. నేటి యువత వనజీవిని స్ఫూర్తిగా తీసుకుని మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, మార్చి 21 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్.. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని కస్బా బజార్, సుందరయ్య నగర్, ఖాజీపుర, శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించడంతోపాటు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రహరీలు లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకే లొకేషన్‌లో ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉన్నచోట క్యూ, రద్దీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే ఇందులో పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కనిపించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఎంఈవో శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ సీహెచ్. స్వామి, అధికారులు తదితరులు ఉన్నారు.

పారపాటు జరిగితే కఠిన చర్యలు

పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన భద్రాద్రి కలెక్టర్

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ, మార్చి 21 : పదో తరగతి పరీక్ష నిర్వహణలో పొరపాటు జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. గురువారం పాల్వంచ కేటీపీఎస్ డీఏవీ మోడల్ స్కూల్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులు పరీక్ష రాసే తీరును పరిశీలించారు. హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఇన్విజిలేటర్లు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో మధు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ స్వామి ఉన్నారు.

వృత్తి నైపుణ్యత పెంపొందించేందుకే శిక్షణ

సీపీ సునీల్ దత్

శిక్షణను పరిశీలిస్తున్న సీపీ సునీల్ దత్

మామిళ్లగూడెం, మార్చి 21 : వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు ట్రైనీ కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల శిక్షణ చాలా కీలకమైనదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ ఫైరింగ్ రేంజ్‌లో సిబ్బందికి ఇస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్ శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఉజ్వల భవిష్యత్‌కు సుదీర్ఘ కాలంపాటు సగర్వంగా అందించబోయే సేవలకు శిక్షణ ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం కావాల్సిన శక్తి సామర్థ్యాలను, నిబద్ధతను శిక్షణలో మీకు వివరంగా నేర్పిస్తామని, తమ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి అంకితభావంతో ముందుకు వెళ్తూ.. పోలీసు శాఖకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తారని విశ్వసిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ గణేశ్, ఏసీపీ రవి, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐలు తిరుపతి, అప్పలనాయుడు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల నిర్వహణ

ఏపీ సరిహద్దు పోలీస్ అధికారుల వీసీలో ఎస్పీ రోహిత్ రాజు

మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

వీసీలో మాట్లాడుతున్న ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి

కొత్తగూడెం క్లైం, మార్చి 21 : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పార్లమెంట్ ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ రోహిత్ రాజు ఏపీ సరిహద్దు పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా సమీక్ష నిర్వహించగా.. ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి సైతం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అధికారులు సమన్వయాన్ని పాటిస్తూ.. ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ నగదు, మద్యం సరఫరాను నిరోధించేందుకు 12 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 10 అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. 24/7 వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు చేపడుతున్న అన్ని చర్యలను ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా నగదు, మద్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో పాల్వంచ, జంగారెడ్డిగూడెం, పోలవరం డీఎస్పీలు, సరిహద్దు పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లిన 51 మందిపై కేసు

వివరాలు వెల్లడించిన సీఐ సురేశ్

మద్యం దుకాణం ముందు బాటిళ్లు

టేకులపల్లి, మార్చి 21 : మండల కేంద్రంలోని మూడు వైన్ షాపుల్లోకి చొరబడి మద్యం సీసాలు ఎత్తుకెళ్లిన 51 మందిపై కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి సీఐ టి.సురేశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. గణేశ్ మద్యం షాపు బాధ్యుడు రూ.9,68,595 విలువ కలిగిన మద్యం సీసాలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొనగా.. సీసీ ఫుటేజీల ఆధారంగా 16 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. క్రాంతి మద్యం షాపు బాధ్యుడు ఎస్.సురేశ్ రూ.5.45 లక్షల విలువైన మద్యం సీసాలు పోయినట్లు ఫిర్యాదు చేయగా.. దుకాణంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా 20 మందిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పల్లవి మద్యం దుకాణం బాధ్యుడు డి.బాలాజీ రూ.68 వేల విలువైన మద్య సీసాలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేయగా.. 15 మందిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా.. బుధవారం రాత్రి మద్యం దుకాణాలను లూటీ చేసి సీసాలు ఎత్తుకెళ్లిన వ్యక్తులు స్వచ్ఛందంగా తీసుకొచ్చి ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేయగా.. గురువారం రేగులతండాకు చెందిన పలువురు మద్యం సీసాలను తీసుకొచ్చి మద్యం షాపు ముందు పెట్టి వెళ్లిపోయారు.

ఏజెన్సీపై డేగకన్ను

- లోక్‌సభ ఎన్నికల వేళ అడుగడుగునా అప్రమత్తం
- జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసు చెక్‌పోస్టులు
- భద్రాద్రి జిల్లాలో 143 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు
- ఇటు ఎన్నికల వేడి.. అటు మావోయిస్టుల అలజడి..

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద పోలీస్ చెక్‌పోస్టు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 21 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల వేళ జిల్లాపై పోలీస్ శాఖ డేగకన్ను వేసి ఉంచింది. ఇటు ఎన్నికల వేడి, అటు మావోయిస్టుల అలజడి నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్ యంత్రాంగాన్ని అలెర్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,095 పోలింగ్ కేంద్రాలుండగా వాటిల్లో 143 కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ సెంటర్లుగా గుర్తించారు. ఇక ఆయా నియోజకవర్గాల్లో అసిస్టెంట్ ఎన్నికల అధికారులను నియమించారు. ఆయా విభాగాల అధికారులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. పోలీస్ అధికారులు ఇప్పటికే 12 అంతర్ రాష్ట్ర, 10 అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా అంతటా నిఘాను ముమ్మరం చేశారు. ఎన్నికల్లో వినియోగించడం కోసం అమాయకులతో డబ్బు తరలింపు ప్రక్రియను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు..

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. సరైన పత్రాలు లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 15 సమస్యాత్మక కేంద్రాలున్నాయి. మరో 128 మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు దగ్గరగా ఉన్నాయి. ఇందుకోసం 14 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కూడా నియమించారు. అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2,500 మంది సిబ్బందిని కేటాయించారు.

ఐదుగురు రిటర్నింగ్ అధికారులు..

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు ఐదుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ప్రియాంక నియమించారు. భద్రాచలానికి ఆర్‌డీవో దామోదర్, అశ్వారావుపేటకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇల్లెందుకు ఎస్‌డీసీ కాశయ్య, పినపాకకు ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, కొత్తగూడేనికి ఆర్‌డీవో మధు నియమితులయ్యారు. వారితోపాటు నోడల్ అధికారులను కూడా నియమించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, లేక రాజకీయ పార్టీల నాయకులపై అభ్యంతరాలు ఉన్నా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా ప్రజలు 1950 నంబరు ద్వారా కంట్రోల్ రూముకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే ఏర్పాట్లు చేశారు. సీ విజల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఓటు వేసే విధానంపైనా, ఫిర్యాదు చేసే విధానంపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మరోవైపు మావోయిస్టుల అలజడి..

ఒకవైపు ఎన్నికల వేడి మొదలైన వేళ మరోవైపు మావోయిస్టుల అలజడి నెలకొంటోంది. ఎన్నికలను బహిష్కరించాలంటూ మావోయిస్టులు లేఖలు విడుదల చేయడం, ఎన్‌కౌంటర్లు జరుగుతుండడం వంటి కారణాలతో సరిహద్దు ప్రాంతాల పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. కూంబింగ్ ఆపరేషన్లను కొనసాగిస్తున్నారు.

24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్నాం..

పార్లమెంట్ ఎన్నికల వేళ నిత్యం అప్రమత్తంగా ఉంటున్నాం. అన్ని చెక్‌పోస్టుల వద్ద కూడా 24 గంటలూ గస్తీ ఏర్పాటుచేశాం. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద మరింత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం, నగదు తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. సరైన పత్రాలు లేకుండా పరిమితికి మించి నగదు తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకుంటున్నాం. **–రోహిత్‌రాజు, ఎస్పీ, భద్రాద్రి జిల్లా**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్

డాక్టర్ రవీందర్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంహెచ్‌వో మాలతి

ఖమ్మం సిటీ/కూసుమంచి, మార్చి 21 : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాను సందర్శించిన ఆయన తొలుత కూసుమంచి పీహెచ్‌సీకి వెళ్లి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఐడీవోసీలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ మాలతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అక్కడి మీటింగ్ హాలులో జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. మాతా, శిశు, ఇమ్యూనైజేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ కీటక జనిత రోగ నివారణ, జాతీయ కుష్ఠు నివారణ, అసంక్రమణ వ్యాధుల నివారణ వంటి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రజలకు అద్భుతమైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి.. జిల్లాను అగ్రగామిగా నిలపాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ సీ సెక్షన్ ఆపరేషన్లు తగ్గించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సైదులు, డాక్టర్ సీతారాం, డీఐవో డాక్టర్ ప్రమీల, డాక్టర్ చందూనాయక్, డీఎల్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ భాస్కర్‌నాయక్, డెమో కాశీనాథ్, ఎన్‌హెచ్‌ఎం డీపీవో నీలోహన తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. ప్రింటింగ్ ప్రెస్, పెట్రోల్ బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులతో ఆయన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రచార సామగ్రి ముద్రణ విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు లోబడి ఉండాలన్నారు. అనుమతి తీసుకున్న తర్వాతనే ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రించాలన్నారు. అనుమతి కోసం నిర్ణీత నమూనా పత్రంలో వివరాలు సమర్పించాలని చెప్పారు. సామగ్రిని ముద్రణకు తీసుకొచ్చిన వారిలో ఇద్దరి నుంచి.. ‘మాకు ఈ పబ్లిషర్ తెలుసు’ అన్నట్లుగా డిక్లరేషన్ కాపీలు రెండింటిని తీసుకోవాలని తెలిపారు. ముద్రించిన ప్రచార సామగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్‌నంబర్, ప్రచురణ ప్రతుల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా తదితర వివరాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ముద్రిత సామగ్రి ప్రతిపై ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్‌తో పాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య, ప్రింటింగ్ ధర తదితర వివరాలను సమర్పించాలని తెలిపారు. ఈ అంశాలను విస్మరించిన ప్రింటర్లపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెట్రోల్ బంకులు, గోల్డ్ షాపుల నిర్వాహకులు తమ రోజువారీ లావాదేవీల వివరాలను తెలపాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి మురళీధర్ రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుతో బతుకులు దుర్భరం

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ
కొత్తగూడెం చేరుకున్న ‘ఆటో బతుకుల’ ప్రచార రథయాత్ర

కొత్తగూడెంలో మాట్లాడుతున్న రవికుమార్

కొత్తగూడెం అర్బన్, మార్చి 21 : గ్యారెంటీ హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై బెల్లంపల్లికి చెందిన రవికుమార్ ‘ఆటో బతుకులు’ అనే అంశంపై వంద ఎపిసోడ్ల సీరియల్ తీస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి నుంచి సీరియల్ యూనిట్ సభ్యులు గురువారం కొత్తగూడెం చేరుకున్నారు. వారికి తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) నాయకులు ఘన స్వాగతం పలికారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న, అనుభవిస్తున్న బాధల గురించి యూనిట్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ‘ఆటో బతుకులు’ సీరియల్ హీరో రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తమ బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. తమ బాధలను కళ్లకు కట్టినట్లు చూపించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల సమస్యలపై వంద ఎపిసోడ్‌లతో కార్యక్రమాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. టీఏడీయూ పట్టణ కార్యదర్శి మాటేటి వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధర్మపురి నరేశ్, గుండ్ల రాజు, జీడీ శ్రీను, లకావత్ రమేశ్, చిలక వెంకట్, చంటి, మాధవ రావు, శ్రీకర్, చందు, బస్టాండ్ అడ్డా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే తెల్లం


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే

భద్రాచలం, మార్చి 21 : హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత : డీఎఫ్‌వో కిష్టాగౌడ్


మొక్క నాటుతున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

ఇల్లెందు రూరల్, మార్చి 21 : రోజురోజుకూ అంతరించిపోతున్న అడవులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని, ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుభాష్‌నగర్ కోర గుట్ట వద్దనున్న పార్కు వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి రికే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఇల్లెందు అటవీ ప్రాంత పరిధిలో మొక్కలు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయని, ఉన్న వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడవుల్లో పెరిగిన మహా వృక్షాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కరోనా కాలంలో వేలాది రూపాయలు పెట్టి ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేసిన వార్తలను టీవీల్లో చూశామని, కానీ.. ఎలాంటి ఫలితం ఆశించకుండా అడవులతో ప్రకృతి మనకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తున్నదని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి భావితరాలకు మంచి భవిష్యత్‌ను అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వెంకన్న, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డీవీవీఎస్‌కే ప్రసాద్, డీఆర్వో సాల్మన్‌రాజు, రాంసింగ్, సీతారాం, సుక్కి, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

25న రామయ్య పెళ్లి పనులు షురూ..

భద్రాచలం, మార్చి 21 : ఈ నెల 25న ఫాల్గుణ పౌర్ణమి(హోలీ పౌర్ణమి)ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఉత్తర వైకుంఠ ద్వారం వద్ద రామయ్య కల్యాణ పనులను ప్రారంభిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పసుపు దంచే కార్యక్రమం, తర్వాత తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో అత్యంత వైభవోపేతంగా డోలోత్సవం, వసంతోత్సవం వేడుకలు నిర్వహించనున్నామని, వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ క్రమంలో 25న స్వామివారికి నిర్వహించే నిత్య కల్యాణం నిలిపి వేస్తున్నామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

ఫ్యూడల్ వ్యవస్థను స్థాపించేందుకే ఎన్నికలు

ఓట్ల కోసం వచ్చే పార్టీలను నిలదీయండి..
మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ లేఖ

మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

కొత్తగూడెం క్లైం, మార్చి 21 : బీజేపీతోపాటు అంటకాగుతున్న పార్టీలను తరిమికొట్టి దేశాన్ని, ప్రజలను కాపాడాలంటూ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో సోషల్ మీడియాలో విడుదలైన లేఖ సంచలనం సృష్టిస్తోంది. లోక్‌సభతోపాటు ఏపీ, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ నుంచి జూన్ వరకు జరుగనున్న నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలన్నీ ప్రజలను మళ్లీ మోసగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలన్నీ ఓట్ల కోసం మద్యం, డబ్బు విచ్చలవిడిగా పంచిపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తున్నాయో తెలిసిందే కాదని లేఖలో పేర్కొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ 2019లో ఎన్నికలకు ముందు కుట్రపూరితంగా పుల్వామా ఘటనను సృష్టించి.. మతోన్మాదాన్ని, జాతీయ నినాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల ఓట్లను దండుకున్నదని ఆరోపించారు. ఈసారి కూడా రామ మందిరాన్ని రెండు వేల కోట్లతో నిర్మించి దానిని ఎరగా చూపి పార్లమెంట్ ఎన్నికలకు ముందుకు తీసుకెళ్తున్నదని పేర్కొన్నారు. పదేండ్ల మోదీ పాలనలో మధ్య యుగాల నాటి ఫ్యూడల్ నిరంకుశత్వ రాష్ట్రాన్ని స్థాపించే లక్ష్యంతో హిందూత్వ ఫాసిజాన్ని అమలు చేస్తూ దేశాన్ని సంక్షోభంలోకి నెట్టిందని లేఖలో వెల్లడించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేసే కాంగ్రెస్ పార్టీని, ఓట్ల కోసం వచ్చే ఇతర పార్టీలను నిలదీయాలని పేర్కొన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిజాన్ని నిర్